క్లుప్తంగా

ఘనంగా ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జి.సిగడాం: చెట్టుపొదిలాం గ్రామంలో ఎండల మల్లికార్జున స్వామి ఆలయం పునఃప్రతిష్ఠాపనోత్సవ పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు తనికెళ్ల సంతోష్‌కుమార్, నేతేటి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ అనంతరం భారీ అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

స్వర్ణ కిరీటం తయారీకి బంగారం వితరణ



బంగారం అందిస్తున్న దాత

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో భూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారికి స్వర్ణకిరీటం నిమిత్తం బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, సుగుణ దంపతులు ఆదివారం అర తులం బంగారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు గోపాలాచార్యులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థి ఎంపిక

శ్రీకాకుళం రూరల్ : వప్పంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి బాన్న యామిని జాతీయ ఉపకార వేతనం(ఎన్‌ఎంఎంఎస్-2025)కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఉమాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి పరీక్షలో విద్యార్థి ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వానికి మా బాధలు పట్టవా?



సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఇంజినీరింగ్ కార్మికుల ఆకలి కేకలు ప్రభుత్వానికి పట్టడం లేదని, 24 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం అన్యాయమని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వై.శ్యామలరావు, ఆర్.సతీష్ అన్నారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద శనివారం నిరవధిక సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు టెక్నికల్ రూ.29200, నాన్ టెక్నికల్ రూ.24500గా పెంచాలని, ఉద్యోగ విరమణ 62 ఏళ్లకు పెంచాలని, హెచ్‌ఆర్‌పీ పాలసీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

నగరాల విద్యార్థులకు ఉపకార వేతనాలు

శ్రీకాకుళం కల్చరల్: పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన నిరుపేద నగరాల కుల విద్యార్థులకు ప్రతిభా స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు నగరాల సంఘం జిల్లా కార్యదర్శి పండు రాజగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 9440195005 నంబర్‌కు ఈ నెల 14లోగా సంప్రదించాలని కోరారు.

అలరించిన 'కర్మఫలం' నాటిక



కర్మఫలం నాటికలో ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో శనివారం బాపూజీ కళామందిర్‌లో విశాఖకు చెందిన జాస్మిన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఈవెంట్స్ నిర్వాహకులు ప్రదర్శించిన 'కర్మఫలం' నాటిక ఆద్యంతం అలరించింది. ముందుగా కార్యనిర్వాహక అధ్యక్షులు పన్నాల నర్సింహమూర్తి అధ్యక్షతన జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రిటైర్డ్ ఏసీటీవో కిల్లాన ఫల్గుణరావు, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎ.కనకరాజు, లైన్స్ క్లబ్ ఎక్స్‌టెన్షన్ చైర్మన్ హారికాప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రతినెలా పేదకళాకారులను ప్రోత్సహిస్తూ కార్యక్రమాలు నిర్వహించడం గొప్పవిషయమని కొనియాడారు. కార్యక్రమంలో కళాకారుల సమాఖ్య సభ్యులు బి.రామచంద్రదేవ్, కంచరాన అప్పారావు, అగతమూడి సింహాచలం, ఇంజరాపు రమణారావు, బి.ఎ. మోహనరావు, బి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి.. నైపుణ్య శిక్షణ

- సత్యసాయి పెద్ద మందిరంలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్
- మగ్గం వర్క్, టైలరింగ్ వంటి స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ
- ఇప్పటికే ఎనిమిది బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి



సత్యసాయి పెద్దమందిరం వద్ద మగ్గం వర్కులో శిక్షణ పొందుతున్న మహిళలు



డిజైన్ అల్లుతూ..

శ్రీకాకుళం కల్చరల్:

మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే ధ్యేయంగా జిల్లా కేంద్రంలోని సత్యసాయి పెద్ద మందిరం వద్ద నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సేవలలో భాగంగా టైలరింగ్, మగ్గం వర్కు వంటి స్వయం ఉపాధి రంగాల్లో ఉచితంగా తర్ఫీదునిస్తున్నారు. కుటుంబాలను స్వయం శక్తితో పోషించుకునే విధంగా నేటితరం మహిళలను తీర్చిదిద్దుతున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు అండగా నిలుస్తున్నాయి.

కుట్టుమిషన్లు సైతం..

శ్రీకాకుళం నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న సత్యసాయి సేవా సమితి (పెద్దమందిరం)లో మహిళల కోసం మగ్గం వర్క్, టైలరింగ్‌లో ఇప్పటి వరకు ఎనిమిది బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశారు. తద్వారా 320 మందికి స్వయం ఉపాధి కల్పించారు. మగ్గం వర్క్, టైలరింగ్‌లో ఒక్కో బ్యాచ్‌లో 20 మంది చొప్పున్న మహిళలకు శిక్షణలు ఇస్తున్నారు. అవసరమైతే ఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రత్యేకంగా శిక్షణలు ఇచ్చి వారికి కుట్టుమిషన్లు సైతం ఉచితంగా అందిస్తున్నారు. టైలరింగ్‌లో యోచన, మగ్గం వర్కులో పావనీ ట్రైనర్లుగా వ్యవహరిస్తున్నారు. నగర పరిధిలో ఎంతోమంది మహిళలు ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నారని నిర్వాహకులు చెబుతున్నారు.



శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందిస్తున్న దృశ్యం (ఫైల్)



టైలరింగ్ నేర్చుకుంటున్న మహిళలు

ఉచితంగా శిక్షణ



నేను పెద్ద మందిరంలో మగ్గం వర్కు నేర్చుకున్నాను. ప్రస్తుతం సీజన్‌లో రోజుకు రూ.500 వరకు సంపాదిస్తున్నాను. కుటుంబ పోషణకు ఆధారంగా ఉంటోంది.

– సుమలత, శ్రీకాకుళం

స్వయం ఉపాధి..



సత్యసాయి సేవా సంస్థల ద్వారా నిర్వహిస్తున్న ఉపాధి కోర్సుల ద్వారా ఎంతోమంది స్వయం ఉపాధి పొందుతున్నారు. పెద్ద మందిరంతో పాటు జిల్లాలోని ఇతర మందిరాలలోనూ నేర్పుతున్నాం.

– సూర రామచంద్రరావు, సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు

ఆర్థిక స్వావలంబన



పేద మహిళలను ఆదుకుంటూ వారి ఆర్థిక స్వావలంబన దిశగా కృషి చేస్తున్నాం. త్వరలో వారికి ఉపాధి అవకాశాలను కూడా మేమే కల్పించేలా చర్యలు తీసుకుంటాం. శిక్షణ పొందినవారికి ధ్రువపత్రాలను సైతం అందిస్తున్నాం.

– కంబ మురళీ, కన్వీనర్, సత్యసాయి పెద్దమందిరం

మగ్గం వర్క్‌లో శిక్షణ..



ప్రత్యేకంగా జూట్ బ్యాగులు తయారీ నేర్చుకునేందుకు పెద్దమందిరం నిర్వాహకులు విశాఖపట్నం పంపారు. నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చిన తరువాత ఉచితంగా జూట్ కుట్టు మిషన్ అందించారు. ఇక్కడే మగ్గం వర్కు నేర్పుతున్నాను.

– పావని, శ్రీకాకుళం

టైలరింగ్‌తో ఉపాధి..



శ్రీకాకుళం సత్యసాయి పెద్ద మందిరంలో టైలరింగ్‌లో శిక్షణ పొందారు. ప్రస్తుతం ఓ ప్రైవేటు షాపులో పనిచేస్తున్నాను. రోజువారీ అవసరాలకు సరిపడా ఆదాయం సంపాదిస్తున్నాను.

– భవానీ, శ్రీకాకుళం

మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలి



ఎంఈవోలకు వినతిపత్రం అందిస్తున్న ఐక్య ఉపాధ్యాయ వేదిక సభ్యులు

రణస్థలం: రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ వేదికకు ఇచ్చిన హామీ మేరకు ఎస్జీటీలకు మాన్యువల్ పద్ధతిలోనే బదిలీలు చేపట్టాలని రణస్థలం ఐక్య ఉపాధ్యాయ వేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు రణస్థలం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవోలు ఎ.త్రినాథరావు, బి.లావణ్యలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ఉపాధ్యాయ ఐక్య వేదిక సభ్యులు డి.కోటేశ్వరరావు, టి.శంకరరావు, బి.అప్పలనాయుడు, ఎస్.కోటేశ్వరరావు, జి.ఆదినారాయణ, జె.వెంకటేశ్వరి, జి.చిన్ని కృష్ణంనాయుడు, కె.శ్రీధర్, వై.శ్రీను, బి.చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గురుకుల ఎంట్రన్స్ టెస్ట్ రాసి ఉత్తమ ర్యాంకులు పొంది ఎంపికైన 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలని గురుకులాల జిల్లా సమన్వయకర్త గుంపుల గ్రేస్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పూర్తి వివరాలకు 9701736862 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన



దుర్గమ్మ తల్లి



ముర్రాట్లు సమర్పిస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఫాజుల్‌బాగ్‌పేటలో దుర్గమ్మ పుట్ట, అమ్మవారి విగ్రహం, శిలాపాదుకల పుట్ట ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శనివారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఈ ఉత్సవంలో ముచ్చవానిపేటకు చెందిన హరిజనులతో తొలి ముర్రాటను సమర్పించి కుంభం నివేదించారు. విశ్వశాంతి కోసం దుర్గాహోమం, సప్తశతి పారాయణలు జరిగాయి. సుమారుగా మూడువేల మంది అమ్మవారికి ముర్రాట్లు సమర్పించారు. డప్పువాయిద్యాలు, శంఖునాదాలు, మంగళవాయిద్యాలతో చల్లదనం చేశారు. కార్యక్రమంలో వీఆర్వో కృష్ణప్రసాద్, శిల్లా శ్రీనివాసరావు, మడ్డి అప్పలరాజు, ఎస్.వెంకటరావు, కమిటీ సభ్యులు సీపాన చిరంజీవి, పన్నాల నర్సింహమూర్తి, గణపతి, మౌళి తదితరులు పాల్గొన్నారు.

కేశవరావు మృతి తీరని లోటు

- సంతాప సభలో వామపక్ష నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగిన కామ్రేడ్ నంబాల కేశవరావు మృతి మావోయిస్టు లోకానికే తీరని లోటని వామపక్ష నేతలు అన్నారు. శ్రీకాకుళం నగరంలో క్రాంతిభవన్‌లో వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు శనివారం సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో ప్రధాన వక్తగా మాట్లాడిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాద్ మాట్లాడుతూ నంబాల కేశవరావును మోదీ ఫాసిస్టు ప్రభుత్వం హత్య చేయడమే కాకుండా, మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. చితా భస్మం ఇస్తే హిందూ ధర్మం ప్రకారం కర్మకాండలు చేసుకుంటామని అడిగితే దానికీ అంగీకరించలేదని తెలిపారు. కేంద్రం ఇలా దాడులు చేస్తూ కార్పొరేట్ శక్తులకు భూమిని, అడవిని, నీటిని అప్పగించడానికి పూనుకుంటోందని ఆరోపించారు. ఈ దేశం సంపదలను కాపాడుకునేందుకు కమ్యూనిస్టు విప్లవకారులు, ప్రజలు పోరాడుతున్నారని, అందుకే వారిని తుదముట్టించడానికి నక్సలైట్లని, మావోయిస్టులని పేరు పెట్టి హత్యాకాండను పాలకవర్గాలు సాగిస్తున్నాయని అన్నారు. ఏడాది కాలంలో సుమారు నాలుగు వందల మంది ఆదివాసీలను, వారికి నాయకత్వం వహిస్తున్న మావోయిస్టు నాయకత్వాన్ని కగార్ పేరుతో హతమార్చారని పేర్కొన్నారు. సభలో సీపీఐ నుంచి తిరుపతిరావు, సీపీఎం(యం) నుంచి కె.మోహనరావు, సీపీఐ(ఎంఎల్)తాండ్ర అరుణ, అమరవీరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర నాయకులు జోగి కోదండం, సీఎల్‌సీ జిల్లా అధ్యక్షుడు పత్రి దానేసు, సామ్నా రాష్ట్ర అధ్యక్షులు నల్లి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

త్యాగ నిరతికి ప్రతీక బక్రీద్



రణస్థలం జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శ్రీకాకుళం జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న మతపెద్ద



ఆత్మీయ ఆలింగనం చేసుకుంటూ..



శ్రీకాకుళం జామియా మసీదు వద్ద ప్రార్థనలు చేస్తూ..

మత సామరస్యం, త్యాగాలకు బక్రీద్ పండగ ప్రతీకగా నిలుస్తుందని, దేవుడు చూపిన సన్మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని రణస్థలం జామియా మసీద్ మతపెద్ద షేక్ సలీమ్ భాయ్ అన్నారు. రణస్థలం జామియా మసీదులో శనివారం బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లాం మతం ఐదు మౌలిక సూత్రాలపై ఆధారపడి ఉంటుందని, ఇందులో ఏ ఒక్కదాన్ని విస్మరించినా విశ్వాసం పరిపూర్ణం కాదన్నారు. శ్రీకాకుళం జామియా మసీదులోనూ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

– రణస్థలం/సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

విద్యార్హతలు సడలించండి

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఏపీఎస్సీపీసీఆర్) అధ్యక్ష, సభ్యుల ఎంపిక కోసం ఈ నెల 5న రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించిందని, అందులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్హతగా పేర్కొన్నారని, దీనిని సడలించి గత నోటిఫికేషన్ల మాదిరిగా పాత విద్యార్హతలతోనే నూతనంగా దరఖాస్తులు ఆహ్వానించాలని చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, ఫోరం న్యాయ సలహాదారు ఎ.ప్రవీణా త్రినాథ్ కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రోగులకు పండ్లు వితరణ



పండ్లు వితరణ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు, సేవా ఉద్యమకారుడు 'మెల్విన్ జోన్స్' అని క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా డేఅండ్‌నైట్ వద్ద ఆస్పత్రిలో రోగులకు పండ్లు, ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర, ఉపాధ్యక్షులు లయన్ ఉర్లం, శివతేజ పట్నాయక్, సభ్యులు పాడుగు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు పట్టివేత

ఎచ్చెర్ల: మండలంలోని బుడగట్లపాలెం గ్రామానికి చెందిన కారి లక్ష్మీ పాన్‌షాప్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 15 మద్యం బాటిళ్లను శనివారం ఎచ్చెర్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వి సందీప్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మెుండేటివీధిలో వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక విష్ణు సహస్రనామ పారాయణలు నిర్వహించారు.

ముగిసిన శాస్త్రీయ నృత్య శిబిరం



జానపద గేయాలకు నృత్యం చేస్తున్న చిన్నారులు

ఎచ్చెర్ల : లావేరు మండలం బెజ్జిపురం యూత్‌క్లబ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో బాలికలకు 30 రోజులుగా శాస్త్రీయ నృత్యంపై నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం శనివారంతో ముగిసింది. సంస్థ అధ్యక్షుడు మేడూరి ప్రసాదరావు, సెట్‌శ్రీ సీఈవో బి.వి.ప్రసాదరావు, జిల్లా దివ్యాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కవిత, ఉపాధి కల్పనా కార్యాలయ అధికారి కె.సుధ, గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత టి.సీ రజాసుబ్రహ్మణ్యం, కోలాటం గురువు లోలుగు దుర్గారావుల సమక్షంలో చిన్నారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. అనంతరం అతిథులకు సంస్థ కార్యదర్శి ఇజ్జాడ అప్పారావు, కోశాధికారి గంట్యాడ అప్పలనాయుడు, బీజేపీ నాయకులు ఇజ్జాడ శ్రీనివాసరావులు సన్మానం చేశారు. కార్యక్రమంలో కలిశెట్టి ధర్మారావు, వడ్డివల్లి శ్రీనివాసరావు, పిన్నింటి నారాయణరావు, ఇజ్జాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఇలా.. నీరు ఎలా?



లావేరు మండలం మురపాకలోని సాగు నీటి చెరువు(నాయుడు చెరువు) పిచ్చి మొక్కలతో పేరుకుపోయింది. దీంతో నీరు నిల్వ కాక, మురుగునీరు పేరుకుపోయి అధ్వానంగా మారింది. అధికారులు స్పందించి ఉపాధి పనులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల

దోమల బెడద



పొన్నాడ పంచాయతీ బింగుపేటలో పారిశుద్ధ్యం లోపించింది. ప్రధాన వీధుల మధ్య కాలువ లేకపోవడంతో వాడుక నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దోమలు స్వైర విహారం చేస్తుండటంతో స్థానికులు రోగాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల

శాలిహుండం బౌద్ధారామంలో యోగాంధ్ర



యోగాసనాలు వేస్తున్న కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

గార : భారతీయ సంస్కృతిలో వేల సంవత్సరాలుగా ఉన్న ప్రాచీన ప్రక్రియ యోగా ప్రధాని మోదీ కృషి వల్ల అంతర్జాతీయంగా మరింత గుర్తింపు పొందిందని కేంద్ర పౌరవిమానాయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శనివారం గార మండలం శాలిహుండం బౌద్ధారామంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 21న విశాఖనగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ప్రధానమంత్రి సారథ్యంలో 5 లక్షల మందితో యోగా కార్యక్రమం జరగనుందన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ చారిత్రక ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, డ్వామా పీడీ విజయకుమార్, డీఎంహెచ్‌వో అనిత, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ జగదీష్, ఉత్తమ్ రాజ్‌రాణా, యోగా గురువులు తంగి స్వాతి, మురళీ, సురేంద్ర, కల్పన పాల్గొన్నారు.

అందమైన ఇంటి కోసం..



సూర బిల్డ్‌మార్ట్‌ను ప్రారంభిస్తున్న చౌదరి అవినాష్, కూన ప్రమీల

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సొంత ఇంటి కల నెరవేర్చుకునే వారందరికీ అన్ని రకాల బిల్డింగ్ మెటీరియల్ ఒక చోట లభించేలా షాపు ఏర్పాటు చేయడం అభినందనీయమని డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, ఆమదాలవలస ఎమ్మెల్యే సతీమణి కూన ప్రమీల అన్నారు. శ్రీకాకుళం నగరంలో సూర బిల్డ్ మార్ట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటిని అందంగా తీర్చిదిద్దేందుకు మార్ట్ ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో ప్రొప్రైటర్ సూర లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగం సమస్యలపై వినతి

శ్రీకాకుళం న్యూకాలనీ: దక్షిణ కాశీగా పేరుపొందిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో ప్రధాన సమస్యలపై న్యూఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ పురావస్తు శాఖ ఆల్ ఇండియా డైరెక్టర్ జనరల్ యద్వీర్ సింగ్ రావత్‌కు ఆలయ అనువంశిక అర్చకులు, యునైటెడ్ నేషన్స్ ఎగైనెస్ట్ కరప్షన్ నేషనల్ అంబాసిడర్ నాయుడుగారి రాజశేఖర్ వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రకటన విడుదల చేశారు. మ్యూజియం పనులు, ప్రహరీ నిర్మించాలని విన్నవించారు.